ప్రజాశక్తి
గురువారం 27 జులై 2023 5
శ్రీ సత్యసాయి

సమస్యలపై సర్పంచులు, ఎంపిటిసిల ఏకరువు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సర్పంచులు, ఎంపిటిసిలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ లోవోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. స్పందించిన ట్రాన్స్‌కో ఎఇ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువగా ఉండటం వల్ల సమస్య నెలకొందని అన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పలువురు సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జడి వాన

- తేలికపాటి వర్షాలే..
- ఎడతెరిపిలేని జల్లులతో జన జీవనానికి ఆటంకం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అల్పపీడిన ప్రభావం ఉమ్మడి అనంతపురం జిల్లాపైనా పడింది. జడివాన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. అయితే ఉమ్మడి జిల్లాలో ఎక్కడా కూడా భారీ వర్షాలేవీ నమోదవ లేదు. తేలికపాటి జల్లులు ఉదయం నుంచి రాత్రి వరకు పడుతూనే ఉన్నాయి. దీంతో సాధారణ జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. జనం బయటకు పూర్తి స్థాయిలో వచ్చి పనులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో తాడిపత్రి ప్రాంతంలో కొద్దిగా ఎక్కువగా వర్షపాతం నమోదవగా సత్యసాయి జిల్లాలో హిందూపురం ప్రాంతంలోని మండలాల్లో కొద్దిగా ఎక్కువగా వర్షపాతం నమోదయింది.

అనంతపురం జిల్లాలో బుధవారం ఉదయం వరకు నమోదయిన సగటు వర్షపాతం 4.6 మిల్లీమీటర్లు ఉంది. ఇందులో అత్యధికంగా యాడికి మండలంలో 15.4 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. గుమ్మగట్టలో కనిష్టంగా 1.2మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. మొత్తంగా చూసినప్పుడు జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 50.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు చస్తే సాధారణ వర్షపాతం 116.4 మిల్లీమీటర్లు అయితే పడింది 96.3 మిల్లీమీటర్లు 17.2 శాతం తక్కువగా వర్షపాతం నమోదయ్యింది. సాధారణానికి దగ్గరగా వర్షపాతం నమోదయినట్టు కనిపించినా ఇంకా 18 మండలాల్లో వర్షపాతం లోటు నెలకొంది. ఇక సత్యసాయి జిల్లాలోనూ అన్ని మండలాల్లో వర్షపాతం నమోదవగా గోరంట్లలో అత్యధికంగా 21.4 మిల్లీమీటర్లు మంగళవారానికి నమోదయ్యింది. ఇక్కడా సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు కురవాల్సింది 128.5 మిల్లీమీటర్లకుగానూ 95.2 మిల్లీమీటర్లు నమోదయ్యింది. ఇక్కడ ఇంకా 17 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

వర్షాలు నేడూ కొనసాగే అకాశం

వర్షాలు ఉమ్మడి అనంతపురం జిల్లాపై బుధ, గురువారాలున్నట్టు వాతావరణ శాఖ ప్రకటనలో పేర్కొంది. ఒక మోస్తరు వర్షాలు అనంతపురం జిల్లాలో పడుతాయని హెచ్చరించింది. సత్యసాయి జిల్లాలో పిడుగులు పడే అవకాశం ఉన్నట్టు ప్రకటనలో పేర్కొంది. వరుసగా పడుతున్న వర్షాల ప్రభావం కొన్ని పంటలపై ఉండే అవకాశముందని కూడా ఆ ప్రకటనలో పేర్కొంది. బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షపాతం మరింత పెరిగింది.

స్తంభించిన జనజీవనం

వర్షం తెరిపిలేకుండా వస్తుండటంతో సాధారణ జనజీవనం స్తంభించింది. రోడ్డుపై జరిగే చిరు వ్యాపారాలు మూతపడ్డాయి. జన సంచారం కూడా చాలా వరకు తక్కువగా ఉంది. ఖరీఫ్‌లో ఇంకా పంటలు పూర్తి స్థాయిలో సాగవకపోవడంతో వర్షాధార పంటలకు పెద్దగా నష్టం వాటిల్లే అవకాశం లేనప్పటికీ ఉద్యానవన పంటలపై ప్రభావం చూపే అవకాశముంది. టమోటా పంట కొన్ని చోట్ల కోత దశకు వచ్చి ఉంది. అధిక వర్షాల వల్ల టమోటా దెబ్బతినే అవకాశమున్నట్టు రైతులు వాపోతున్నారు. మంచి ధర ఉన్న సమయంలో పడుతున్న ఈ వర్షం వల్ల రైతులకు నష్టం చేకూరుతుందన్న ఆందోళన నెలకొంది.

కదిరి బస్టాండ్‌లో కురుస్తున్న వర్షం

గూగూడు ఉత్సవాలపై వర్షం దెబ్బ

- వ్యాపారాలన్నీ వర్షార్పణం
- వృథా అయిన ముందస్తు ఏర్పాట్లు
- భక్తులు లేక చినబోయిన చిన్న సరిగెత్తు
- బాడుగలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందంటున్న వ్యాపారులు

వర్షంతో గూగూడులో ఖాళీగా ఉన్న వ్యాపార సముదాయాలు

గూగూడులో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి-నార్పల

జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించే గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలకు ఈ సారి జడివాన అడ్డంకిగా మారింది. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జడివానతో బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా దాదాపు 10 రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు ఇక్కడ దుకాణాలు నిర్వహిస్తారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూగూడుకు వచ్చే భక్తుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. దీంతో వ్యాపారాలు సన్నగిల్లాయి. కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చిన్నసరిగెత్తు భక్తులు లేక వెలవెల బోయింది. ప్రతి ఏడాదీ చిన్నసరిగెత్తు ఉత్సవానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తేవారు. ఈ ఏడాది జడివానకు ఆస్థాయిలో భక్తులు ఎవరూ రాలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వివిధ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులకు వ్యాపారాలు లేక ఇబ్బంది పడ్డారు. తాము తీసుకున్న స్థలాలకు బాడుగలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లపైనా వర్షం దెబ్బ

రెండు రోజులుగా కురుస్తున్న జడివానకు అటు బ్రహ్మోత్సవాల నిర్వహణకూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా వివిధ పంచాయతీల నుంచి పంచాయతీ కార్మికులను పిలిపించి గూగుడు గ్రామం మొత్తం పారిశుధ్య పనులు చేయించారు. రోడ్డుపై మొత్తం మట్టి గ్రావెల్‌ను తోలించి అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామ సర్పంచ్ రమణకుమారి శివయ్య, ఎంపీడీవో దివాకర్, ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో గత పది రోజుల నుంచి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ఏర్పాట్లు అన్నీ కూడా వృథా అయినట్లు కన్పిస్తోంది. వర్షాల దెబ్బకు గుగూడులోని డ్రెయినేజీ నీరు మొత్తం రోడ్లపై పారుతోంది. ఆలయానికి వచ్చే రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వీటిపై భక్తులు నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే కుళ్లాయి స్వామి పెద్ద సరిగెత్తు, అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాల్లో భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

భక్తులపై టోల్‌బాదుడు..

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి గూగూడుకు వచ్చే భక్తులపై టోల్‌బాదుడు పడుతోంది. గూగూడు గ్రామ సరిహద్దులోనే పంచాయతీ గేటును ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా టోల్‌ను వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనానికి సైతం రూ.20 వసూలు చేస్తున్నారు. కార్లు, ఇతర వాహనాలకు వంద రూపాయల టోకెన్లు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తాము పంచాయతీలో వేలాలు పాడామని, అందుకే టోల్ వసూలు చేస్తామని చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును ప్రజాశక్తి వివరణ కోరగా టోల్‌గేటు వసూలుకు పంచాయతీ వేలాలు వేసిన మాట వాస్తవమే అన్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలకు ఎటువంటి రుసుం లేదన్నారు. ఆటోకు రూ.30, కారుకు రూ.50, ఇతర భారీ వాహనాలకు రూ.70 వసూలు చేయాలని పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టోల్ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాడుగ కూడా వచ్చే పరిస్థితి లేదు

మదనపల్లి నుంచి వ్యాపారం నిమిత్తం గూగూడుకు వచ్చాను. కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో బొమ్మల దుకాణం ఏర్పాటు చేయడానికి రూ.20 వేలకు స్థలాన్ని బాడుగకు తీసుకున్నాను. ఈ ఏడాది వర్షాల వల్ల వ్యాపారాలు జరగడం లేదు. కనీసం స్థలం బాడుగ కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

చిన్నా, బొమ్మల దుకాణం నిర్వాహకుడు.

కొనేవారే కరువయ్యారు

గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తాను ప్రతి ఏడాదీ గుంతకల్లు నుంచి గూగూడుకు వచ్చి కాజా, మిఠాయి అమ్మకాలు చేస్తున్నాను. ప్రతి ఏడాదీ అమ్మకాలు ఆశాజనకంగా ఉండేవి. ఈ ఏడాది వర్షాల వల్ల మిఠాయిలు కొనేవారే కరువయ్యారు.చాలా నష్టపోవాల్సి వస్తోంది.

ప్రసాద్, మిఠాయి వ్యాపారి.

తక్కువగా వస్తున్నారు...

గాజుల వ్యాపారం నిమిత్తం రాప్తాడు నుంచి ప్రతి ఏడాది గూగూడుకు వస్తాను. చిన్న సరిగెత్తు సమయానికి సుమారు తాను తెచ్చిన సరుకులో సగభాగం అమ్ముడుపోయేవి. ప్రస్తుతం వర్షం కారణంగా గూగూడుకు వచ్చే మహిళల సంఖ్య తగ్గింది. ఇప్పటి వరకు తెచ్చిన సరుకులో 10 శాతం కూడా అమ్ముడుపోలేదు.

హనుమంతప్ప, గాజుల వ్యాపారి.

భూస్వాధీన పోరాటంలో పేదలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

పేదలంటే ఎందుకింత నిర్లక్ష్యం..?

- ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం ఆగదు
- అధికారులు స్పందించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి -పెనుకొండ

'ఏళ్ల తరబడి సొంత స్థలం లేక, ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అనేక మార్లు వీరు అధికారులు ప్రజాప్రతినిధులకు దరఖాస్తులు అందించారు. అయినా వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయలేదు. పేదలంటే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎందుకింత నిర్లక్ష్యం'... అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ప్రశ్నించారు. పెనుకొండ మెడికల్ కళాశాల ఎదురుగా 668 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని భూస్వాధీన పోరాటం చేస్తున్న పేదలకు ఆయన బుధవారం నాడు మద్దతు తెలిపారు. సిఐటియు, వ్యకాసం, సిపిఎం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోరాటం బుధవారం నాడూ కొనసాగింది. ఈ సందర్భంగా ఇంతియాజ్ పేదలను కలిసి వారితో మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓ వైపు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో స్థలాలు చూపిస్తామని చెబుతున్నారని, ఆచరణలో అది అమలుకావడం లేదన్నారు. పెనుకొండలో ఇళ్ల పట్టాల కోసం అనేక మంది పేదలు దరఖాస్తు చేసుకుని సంవత్సరాలు గడుస్తున్నా వారిని పట్టించుకునే వారు లేరన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి పట్టాలు ఇచ్చేంత వరకు భూస్వాధీన పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వెంకటేష్, రంగప్ప, తిప్పన్నా, కొండ వెంకటేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్లు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయ శానిటేషన్, ఎన్వీరాల్‌మెంట్ సెక్రటరీలు విస్తృతంగా దాడులు నిర్వహించారు. 32వ వార్డు పరిధిలో 80 కిలోల నిషేదిత ప్లాస్టిక్‌ను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేద చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చాయన్నారు. ఇక నుంచి ప్రతి రోజు దాడులు నిర్వహిస్తామన్నారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వారితో పాటు వీటిని ఉపయోగించే వారిపై సైతం పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తామన్నారు. ఒక సారి పట్టుబడిన వారు రెండో సారి పట్టుబడితే వారికి పెద్ద ఎత్తున జరిమానాలు విధించడంతో పాటు పోలీస్ కేసులు సైతం నమోదు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

హిందూపురం : సచివాలయాల పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి సక్రమంగా అందించేలా కృషి చేయాలని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో కలిసి 14వ వార్డు సచివాలయాన్ని వైస్‌ఛైర్మన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి వారి లబ్ధి పొందేలా చూడాలన్నారు. సచివాలయాలకు వస్తున్న సర్వీసులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని విరివిగా మొక్కలు నాటడం ద్వారానే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన పకృతిని అందించగలమని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య శాఖతో పాటు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు - పరిష్కారాలు అనే అంశానికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, డిఎంహెచ్ఒ ఎస్‌వి. కృష్ణారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విస్తతంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నేడు వాహనాల వేగం పెంచుతూ ఇంధన కొరతతో పాటు వాతావరణ కాలుష్యానికి కారణం అవుతున్నాయన్నారు. కార్బన్ డయాక్సైడ్ తదితర విషపూరిత వాయువులు వాతావరణంలో పరిమితికి మించి పెరగడంతో భూమండలం వేడెక్కుతోందన్నారు. తద్వారా అడవులు జల వనరులు క్రమంగా తగ్గిపోతున్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాధించిన పురోగతి కూడా పకృతి కాలుష్యానికి కారణం అవుతున్నాయన్నారు. మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం, ప్లాస్టిక్‌కి దూరంగా ఉండటం, ఇంధన వాడకం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకొందామని పిలుపునిచ్చారు. వాతావరణం కాలుష్యం కాకుండా ఉండటానికి ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి వారిని భాగస్వాములు చేయాలని అప్పుడే కొంతవరకైనా పకతిని కాపాడుకోవచ్చుని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రషీద్, డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి నిరంజన్ రెడ్డి, భూగర్భ జలాల శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విజయవాడ బస్సు సర్వీసును యథావిధిగా నడపాలి

మడకశిర : మడకశిర నుండి విజయవాడ వెళ్లే బస్సు సర్వీసును యథావిధిగా నడపాలని నియోజకవర్గ ప్రజలు కోరుచున్నారు. గతంలో సాయంత్రం 6 గంటలకు మడకశిర నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటలకు విజయవాడ చేరుకునేది. తిరిగి సాయంత్రం 7:45 నిమిషాలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు మడకశిరకు చేరుకునేదని చెప్పారు. అయితే ఇటీవల ఆ బస్సును విజయవాడలో రాత్రి తొమ్మిది గంటలకు బయలుదేరే విధంగా చేయడం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

కదిరి టౌన్ : కరెన్సీ నోట్లపై డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటోలు ముద్రించాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకట రమణ డిమాండ్ చేశారు. డిల్లీలో జంతర్ మంతర్ వద్ద జర్రిపోతుల పరుశురామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణయ్య, బత్తల వెంకటరమణతో పాటు బీద మస్తాన్ రావు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తల వెంకటరమణ మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటో కరెన్సీ మీద ముద్రించాలని డిమాండ్ చేశారు. ఆనాడు బ్యాంకుల జాతీయకరణకు, ఆర్‌బిఐ వ్యవస్థ నెలకొల్పడానికి అంబేద్కర్ సూచించిన విధానాలే అనుసరించారని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ గుర్తించిన మేధావి అంబేద్కర్ ఫొటోను ముద్రించి ఆయనను గౌరవించుకుందామని కోరారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కరెన్సీ పై అంబేద్కర్ ఫోటోలు ముద్రించే వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని వర్గాలను కలుపుకొని పోరాడుతామని హెచ్చరించారు.

రజక సంఘం మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రజకుల సమస్యల పరిష్కారం కొరకు ఆగస్ట్ 13న పుట్టపర్తి లోని శ్రీ సాయి ఆరామంలో నిర్వహించే ఎపి రాష్ట్ర రజక సంఘం ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి టి. ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు పి. కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, పట్టణ ప్రాంతంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, రజక కమ్యూనిటీ హాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని సంవత్సరాల తరబడి ఉద్యమాలు చేస్తున్న, ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామచంద్ర, జిల్లా కన్వీనర్లు శ్రీనివాసులు, సంఘాల ఆనంద్, ధర్మవరం రజక సంఘం నాయకులు ప్రసాద్, రాధాకృష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

మల్బరీసాగు లాభదాయకం

పుట్టపర్తి రూరల్: వాతావరణ పరిస్థితులను బట్టి చూస్తే మల్బరీ సాగు ఎంతో లాభదాయకమని ఈ పంట సాగుకు రైతులు మక్కువ చూపాలని సిరికల్చర్ ఎడి ఇఎస్. నరసింహులు, ఎస్ఒ సుమాముక్త పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పెడపల్లి రైతు భరోసా కేంద్రంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. మల్బరీ సాగు చేస్తే పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువని చెప్పారు. రైతులకు మల్బరీ సాగు పై ప్రభుత్వం సబ్సిడీలు అధికంగా అందజేస్తుందని వివరించారు. పంట బాగా వస్తే కేజీ పట్టుగూళ్ల పై 50 శాతం ఇన్సెంటివ్ అందిస్తామని తెలిపారు. గతంలో గోరంట్ల పెనుగొండ పుట్టపర్తి మండలాల్లో రనైతులు ఎక్కువ మల్బరీ సాగు చేసేవారని చెప్పారు. వారిని గతం కంటే ఇప్పుడు ఎక్కువ ప్రోత్సాహకాలు ఇస్తున్నామని తెలిపారు. రైతులందరూ మల్బరీ సాగు పైన మక్కువ చూపాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో పెడపల్లి పంచాయతీ సర్పంచి మంగ్లీ బాయ్, ఉప సర్పంచి శ్రీనివాసులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది నాగ రమేష్, డింపుల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

లేపాక్షి : మండలంలోని గొంగటి పల్లిలోని రైతుల పంటపొలాలను ఏరువాక కేంద్రం పుట్టపర్తి శాస్త్రవేత్తలు డాక్టర్ రవికిషోర్, కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, హిందూపురం సహాయ వ్యవసాయ సంచాలకులు జి.ఎం అల్తాఫ్ అలీ ఖాన్ బుధవారం పరిశీలించారు. ఈనెల 31 వరకు వేరుశనగ విత్తుకోవచ్చని రైతులకు చెపాపరు. అలాగే మొక్కజొన్న పంట సాగు, ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీలత, ఎఇఒ పుష్పలత, ఆర్‌బికె సిబ్బంది రఘు, తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

పెనుకొండ : పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లను ఉపయోగంలోకి తేవాలని అంగన్వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో రమణకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ సమావేశాలకు హాజరైనప్పుడు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ కార్యాలయం వెనుక సచివాలయం, అర్బన్ హెల్త్ సెంటర్, అంగన్వాడీ సెంటర్ భవనాలను నిర్మించే సమయంలో మరుగుదొడ్లు దెబ్బతిన్నాయన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు బావమ్మ, వరలక్ష్మి, మహబూన్నిసా, నిర్మల, రాజేశ్వరి, శోభా బాయి, సునంద, అనిత, షాలిని, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ఓబుల దేవర చెరువు : మండల కేంద్రంలో టిడిపి నాయకులు మినీ మేనిఫెస్టో మిషన్ రాయలసీమ కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బూదిలి ఓబులరెడ్డి ,ప్రధాన కార్యదర్శి మనోహర, నాయకులు మురళి,సుధీర్, అంబులెన్స్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు వేడుకలు

బత్తలపల్లి :మండల కేంద్రమైన బత్తలపల్లిలో చిన్నకాంశింస్వామి, పెద్దకాశింస్వామి మొహరం ఉత్సవాలలో భాగంగా బుధవారం చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు పానకాలు చదివించారు. గురువారం ఉదయం గ్రామోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మొహరం సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు నిర్వహించారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు

లేపాక్షి : క్రైం కేసు ఛేదింపులో ప్రతిభ కనపర్చిన స్థానిక ఎస్ఐ మునీర్ అహ్మద్‌కు అవార్డు రావటంతో మండల ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. భవిష్యత్తు లో మరిన్ని అవార్డు లు పొందాలని వారు ఆకాక్షించారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండూరు గ్రామ రెవిన్యూ పొలానికి సంబందించిన రికార్డులను పరిశీలించారు. రీ సర్వే ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో నరసింహ నాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు

టిడిపి కార్యకర్తలకు పరామర్శ

ధర్మవరం టౌన్ : తాడిమర్రి మండల కేంద్రంలో ఈనెల 1న జరిగిన ఘటనలో నిందితులుగా ఉండి ధర్మవరం సబ్ జైలులో ఉన్న టీడీపీ కార్యకర్తలను ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ బుధవారం పరామర్శించారు. మధ్యాహ్నం జైలు సందర్శన సమయంలో ఆయనతోపాటు తాడిమర్రి టిడిపి మండలకన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు పక్కీర్‌రెడ్డి, మల్లి, ప్రతాప్, గణేశ్, మెరీగౌడ్ తదితరులు టిడిపి కార్యకర్తలను పరామర్శించారు.

త్వరలో వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని చిగిచెర్ల రెవెన్యూ పంచాయతీలోని గరుడ పల్లిలో 11.10 ఎకరాలలో వేరుశెనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఉద్యానవన అధికారిని అమరేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గరుడం పల్లి గ్రామంలో వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చొరవ వల్ల వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ ఇక్కడ నెలకొల్పుతున్నారని చెప్పారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. రూ.75 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమవుతాయని చెప్పారు.

ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు

పుట్టపర్తి క్రైమ్ : ప్రజలకు నిత్యం అవసరమయ్యే కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. బుధవారం స్థానిక కూరగాయల దుకాణాల్లో కూరగాయల రేట్లు మండిపోయాయి. టమోటా కిలో ధర 140 రూపాయలు, పచ్చిమిరప కిలో 120, బీన్స్ 120, క్యారెట్ 80, బంగాళదుంప 70 పలికారు. ప్రతి మంగళ, శని వారాల్లో వారపు సంతలో కూడా ఈ ధరలు ఏమాత్రం సామాన్యులకు అందుబాటులో లేవు. వారం రోజులకు సరిపడే కూరగాయలు తీసుకురావటానికి వెయ్యి రూపాయలు తీసుకెళ్లినా ఏ మూలకు సరిపోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ మార్కెట్ ఏర్పాటు చేసి నిర్ణీత ధరలకు కూరగాయలు విక్రయించాలని పలువురు కోరుతున్నారు.

వర్షంతో స్తంభించిన జనజీవనం

వర్షంలో తడుస్తూ వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తిలో మంగళ, బుధవారం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షానికి 192 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురిసినప్పటికీ సాయంత్రం ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘాలు కమ్ముకొని ఏకధాటిగా కురిసిన జల్లులతో ప్రజలు తమ పనులు చేసుకోవడానికి ఆటంకంగా మారింది. ప్రయాణికులు లేక ఎక్కువ ఆర్టీసీ బస్సులు ఖాళీగా నడిచాయి. మరో రెండు రోజులపాటు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు పనులు మానేయాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా దుక్కి దున్ని చదును చేసుకున్న రైతులు వేరుశనగ పంట పెట్టుకొనుటకు సంసిద్ధులవుతున్నారు. ఈ నెలాఖరి వరకు విత్తనం మెచ్చుకోవచ్చని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పినందున వర్షం తెరపి ఇచ్చిన తర్వాత పంటలు సాగు చేసుకోవటానికి రైతులు సిద్ధమవుతున్నారు.

మడకశిర : మూడు రోజుల నుండి వరుసగా జడి వాన పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లడానికి వానలో నడిచి పోతున్న విద్యార్థులకు ఏం ప్రమాదం జరుగుతుందో అని వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా దిన కూలితో జీవనం గడిపేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటంతో కూలి పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోతున్నారు. ఇక మల్బరీ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిసిన ఆకును పురుగులకు వేయడం వల్ల అవి గూళ్లు కట్టకుండా పోతున్నాయని దీంతో నెలరోజుల కష్టపడితే చేతికొచ్చిన పంట నోటికి అందకుండా పోతోందని వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుండి కళాశాలలకు వచ్చే విద్యార్థులు వర్షంలోనే తడిసి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కదిరి అర్బన్ : కదిరిలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా గంటపాటు కుండపోత వర్షం కురిసింది. కొద్దిసేపు ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి, ఇలాంటి వర్షం రెండు గంటలు కురిసిందంటే పరిసర ప్రాంతాలలోని చెరువులు, కుంటలు నిండి పొర్లుతాయని ప్రజలు వ్యాఖ్యానించారు.

సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి

హిందూపురం : పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు, ఎస్‌డిజిఎస్ కళాశాల కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్‌ను వైసిపి సమన్వయకర్త దీపిక కోరారు. ఈ మేరకు బైసాని రాంప్రసాద్‌ను ఆయన నివాసంలో బుధవారం కలిసిన దీపిక పార్టీ అభివృద్ధిపై చర్చించారు. గతంలో ఏ విధంగా పార్టీలో పని చేశారో అదే విధంగా ఇప్పుడు కుడా పని చేయాలని కోరారు. అనంతరం రాంప్రసాద్ సాంప్రదాయంగా దీపికను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేణు రెడ్డి, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తం రెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులుగా కదిరప్ప

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులుగా కదిరప్పను నియమించారు. ఈ మేరకు పిసిసి అధ్యక్షులు రుద్రరాజు , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమి ,రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ శంకర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని కదిరప్ప తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గుర్తించి సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

రైతాంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

సమావేశంలో మాట్లాడుతున్న బడా సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి - కదిరి టౌన్

దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ గిరీష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి విమర్శించారు. కదిరిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి అధ్యక్షతన రైతు సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి జేవీ రమణ,రైతు సంఘం నాయకులు వివి రమణ ఎస్వీ రమణ శివన్న శ్రీరాములు శంకర్ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటుకు అండగా నిలబడుతూ పచ్చని పంటలు పండించే భూములను తక్కువ ధరకు అప్పనంగా కట్టబెడుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలు ప్రోత్సహించడంతోపాటు రైతాంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల పండించిన పంటలకు మద్దతు ధరలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే చివరకు దిగుబడి మద్దతు ధర లేక విలవిలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అన్ని రకాల అప్పులు మాఫీ చేయాలని, రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టబద్ధత చేయాలని కోరారు. విద్యుత్ ప్రైవేట్ కరణ బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాడి పశువుల రైతులకు ఇన్సెంటివ్ అందజేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పాడి రైతులకు సబ్సిడీ రుణాలు అందించాలని ,కూరగాయలు సాగు చేసే రైతులకు సబ్సిడీతో విత్తనాలు ఎరువులు, ట్రేలు, డ్రిప్పు పరికరాలు అందించాలని కోరారు. భూ యజమానుల నిమిత్తం లేకుండా కౌలు రైతులకు హక్కుల పత్రాలు అందించాలన్నారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని ముంపు రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహాశక్తి చైతన్య రథయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గంలో ఈ నెల 31 నుండి నిర్వహించే మహాశక్తి చైతన్య రథయాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూఈనెల 31న మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయతీలో మహాశక్తి చైతన్య రథయాత్రను ప్రారంభిస్తామని నియోజకవర్గ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, పట్టణ అధ్యక్షులు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ, క్లస్టర్ ఇన్‌ఛార్జికల్లుమర్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి కదిరి అర్బన్

సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వలిసాబ్ రోడ్డు సచివాలయం 26వ వార్డు పరిధిలోని ఇక్బాల్ రోడ్డు, పాతకుమ్మర వీధి, ఖిలాడిబాషా వీధి, త్యాగరాజు వీధి, ఆజాద్ వీధి, బందు సాబ్ వీధి, ఆలం ఖాన్ వలి మసీద్ తదితర ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పథకాలు నిలిపివేత : టిడిపి

మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తున్న పరిటాలశ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పథకాలను నిలిపివేస్తున్నారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని 37వ వార్డులో పరిటాలశ్రీరామ్ ఆధ్వర్యంలో భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరంలో అరాచకాలు, బెదిరింపులకు అడ్డుకట్టపడాలంటే టీడీపీ అధికారం లోకి రావాలని అన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఆరు పథకాలను అన్ని వర్గాల కోసం తీసుకువచ్చారని చెప్పారు. వైసీపీలో సాగుతున్న అక్రమాలు, దౌర్జన్యాలను చూసి ప్రజలు విసిగిపోయారన్నారు. ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. అంతేకాకుండా సంక్షేమ పథకాలు కూడా కట్ చేస్తున్నారన్నారు ఇలాంటి వాటికి టీడీపీ అధికారంలోకి రాగానే చెక్ పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పణికుమార్, పురుషోత్తం గౌడ్, ఓం ప్రకాశ్, కొత్తపేటఆది, ఊడుగుండ్ల వాసుదేవ్, అమర్, బిల్లేరామకృష్ణ, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

చిలమత్తూరు : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించడమే జగనన్న సురక్ష ఉద్దేశ్యం అని హిందూపురం నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జి దీపిక అన్నారు. ఈ మేరకు చిలమత్తూరు లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న దీపక మాట్లాడుతూ అర్హులెవరూ కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే సదుద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం తలపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మధుమతిరెడ్డి, నాగభూషణ రెడ్డి, వేణురెడ్డి,ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, సర్పంచి సంధ్య, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

బత్తలపల్లి : తాడిమర్రి గ్రామసచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ భువనేశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ సావిత్రి భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వైటి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ సాయినాథ్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామాంజనేయులు, డ్వామా పీడీ రామాంజనేయులు, తహశీల్దార్ నాగరాజు ఎంపీడీవో విజయలక్ష్మితో పాటు ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని గాండ్లవారిపల్లి సంకేపల్లి గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను వివరించారు. ప్రధానంగా నీటి సమస్యను ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగేంద్ర, ఈవోఆర్డీ ఖాదర్‌బాషా, జెడ్పీటీసీ తిరుమల సేవేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు, తదితరులు

మణిపూర్ ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ

లేపాక్షి : మణిపూర్ ఘటనకు నిరసనగా మండలం పరిధిలో ని పులమితి పంచాయతీ లోని సడ్లపల్లి గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ సిబ్బంది జయమ్మ,సునీత తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ చిలమత్తూరు మండల కేంద్రంలో ఐసిడిఎస్ సీడీపీవో రెడ్డి రమణమ్మ ఆధ్వర్యంలో అంగన్ వాడి కార్యకర్తలు బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటనకు పాల్పడిన దుండగులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో మహిళలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి రెడ్డి, ఫక్రుద్దీన్, నారాయణరెడ్డి, అలీమ్, అక్కమ్మ, విజయలక్ష్మి, అలివేలమ్మ, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గొంతు కోసుకుని ఒడిస్సా వాసి మృతి

పెనుకొండ : పట్టణంలోని ఆల్విన్ కాలనీ లో ఓ ఇంటిలో గొంతు కోసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. నేషనల్ ప్లాస్ట్ కంపెనీ లో పనిచేస్తున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బికాస్(27) అనే వ్యక్తి గొంతు కోసుకోవడంతో అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరు కు తరలిస్తుండగా బాగేపల్లి వద్ద మృతి చెందారు.మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు.విషయం తెలుసుకున్న పెనుకొండ డిఎస్పీ హుస్సేన్ పీరా విచారణ చేపట్టారు.పెనుకొండ సిఐ కరుణాకర్, ఎస్ఐ రమేష్ బాబు తో కలిసి సంఘటన స్థలానిన పరిశీలించి వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సుంది.

బికాస్ (ఫైల్‌ఫొటో)

మామిడి చెట్లు నరికివేత పై ఎస్పీకి ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్ : తనకు చెందిన 500 మామిడి చెట్లను కక్షపూర్వకంగా నరికి వేశారని బాధితుడు కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన రామన్న ఎస్పీ మాధవరెడ్డికి బాధితులు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ముక్తాపురం గ్రామంలో సర్వే నంబర్ 490-2 లో 11. 44 ఎకరాల భూమిలో గత మూడు సంవత్సరాల క్రితం500 మామిడి చెట్లు సాగు చేశామని చెప్పారు. ఈ భూమి 1990 సంవత్సరము నుండి తమ ఆధీనంలో ఉందన్నారు. అప్పుడు 23 వేల రూపాయలకు కొనుగోలు చేశామని చెన్నే కొత్తపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా అయిందని ఆనాటి నుండి పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. అయితే రెండు సంవత్సరాల నుండి చేన్నే కొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన కొండపల్లి శంకర్ కుమారులు వారికి ఎలాంటి ఆధారాలు లేకున్నా ఈ భూమి తమదేనంటూ దౌర్జన్యం చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయాడు. ఇదే విషయంపై గతంలో కలెక్టర్‌కు, ధర్మవరం ఆర్డీవోకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ కక్షతో మంగళవారం అర్ధరాత్రి తమ పొలంలోని మామిడి చెట్లన్నీటిని నరికి వేశారని, తమపై కూడా మారణాయుధాలతో దాడి చేశారని బాధితుడు తెలిపారు. వారి నుండి తమకు ప్రాణహాని ఉందమీ నేపథ్యంలో పోలీసులు తమకు రక్షణ కల్పించాలని కోరారు. తమపై దాడి చేసిన కొండపల్లి శంకర్ కుమారులైన కొండపల్లి రామన్న ఆదినారాయణ, నరసింహప్ప నల్లప్పపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

ప్రమాదంలో పలువురికి గాయాలు

ముదిగుబ్బ : మండలంలోని సంకేపల్లి బిఎస్ఎన్ఎల్ టవర్ సమీపాన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ముందు వెళు న్న ఎద్దుల బండిని ఢీ కొన్న ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

సారా విక్రేతల బైండోవర్

కదిరి అర్బన్ :మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సమీపాన బాలప్ప గారి పల్లి వద్ద నాటు సారా విక్రయిస్తున్న వారిని పోలీసులు బైండోవర్ చేశారు. సారా విక్రేతలు మల్లప్ప ,భారతి, జ్యోతిని అదుపులోకి తీసుకుని తహశీల్దార్ నటరాజు వద్ద బైండోవర్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ముదిగుబ్బ : మండలంలోని ఇందుకూరు గ్రామానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ హేమంత్ కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ప్రతాపరెడ్డి (31) మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో పులివెందుల నుంచి తన స్నేహితుడు మంగళవారం మద్యం తీసుకొని రాగా మరో వ్యక్తితో కలసి ప్రతాప్ రెడ్డి తన ఇంటి మేడపైకి వెళ్లారు. అక్కడ ముగ్గురు కూర్చొని మద్యం సేవించారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించారు ఒక వ్యక్తి ఏడు గంటలకు సమయానికి వెళ్లిపోగా పులివెందుల నుంచి వచ్చిన వ్యక్తితో కలసి ప్రతాప్‌రెడ్డి మద్యం సేవించాడు. అయితే బుధవారం ఉదయం 9 గంటలు కావస్తున్న ప్రతాప్‌రెడ్డి మేడపై నుంచి కిందికి దిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన ప్రతాప్‌రెడ్డి చిన్నాన్న వేణుగోపాల్ రెడ్డి మేడ పైకి వెళ్లి చూడగా ప్రతాపరెడ్డి మృతిచెంది పడి ఉన్నాడు. పులివెందుల నుంచి వచ్చిన ప్రతాపరెడ్డి స్నేహితుడు పరారీలో ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా మృతుడి ముఖంపైనా, గొంతుపైనా ఉన్న గాయాలను పోలీసులు గుర్తించారు.

కానిస్టేబుల్‌కు డిఐజి ప్రశంసలు

హిందూపురం : గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాము ఒక హత్య కేసును రెండు రోజుల్లో పరిష్కరించి అనంతపురం రేంజ్ డిఐజి చేత ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతు గత నెల ఒక గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హత్య చేసి పాలసముద్రం హై వే పక్కన కలవర్ట్ కింద పడి వేశారన్నారు. మృతదేహం దగ్గర పాకెట్ లో ఒక మార్కెట్ చీటీ దొరికిందని దాని ఆధారంగా కేసును రెండు రోజుల్లో ఛేదించామని చెప్పారు.

బాలిక ఆచూకీ లభ్యం

కొత్తచెరువు రూరల్: పుట్టపర్తి మండలం కంబాలపర్తి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె ప్రియదర్శిని ఈ నెల 19 తేదీన కొత్తచెరువులో తప్పిపోయినట్లు ఆమె తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్ఐ లింగన్న బాలిక ఆచూకీ కనుక్కొని బుధవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

పారదర్శకంగా ఓటరు సర్వే

ధర్మవరం టౌన్ : ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్, చంద్రబాబు నగర్, శాంతినగర్ లో నిర్వహిస్తున్న సర్వే ఓటర్ల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ప్రతి రోజు ఒక బిఎల్ఓ, బిఎల్ఎ 35 నుంచి 40 ఓటర్లను టార్గెట్‌గా సర్వే చేయాలని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో 1,00,603 మంది ఓటర్లు ఉన్నారని ఇప్పటివరకు దాదాపు తొమ్మిది వేల వరకు సర్వేను పూర్తి చేశామని చెప్పారు. సర్వేకు వచ్చే బిఎల్ఓలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు అనారోగ్యంతో మృతి

కదిరి అర్బన్ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారి కాటం శంకర్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ మృతి వార్తను తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు, పలు రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

డ్రైవర్ కుటుంబానికి చేయూత

పుట్టపర్తి : ఇటీవల మృతిచెందిన టాక్సీ డ్రైవర్ రవి కుటుంబానికి పుట్టపర్తి టాక్సీ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయూతను అందించారు. టాక్సీ డ్రైవర్ రవి కుటుంబానికి లక్ష రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

చిలమత్తూరు పోలీసులకు ఉత్తమ అవార్డులు

చిలమత్తూరు : క్రైం కేసుల ఛేదింపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విభాగంలో చిలమత్తూరు ఎస్ఐ శ్రీనివాసులు,కానిస్టేబుల్ పవన్, క్రిష్ణ, విజయ్ కుమార్ నాయక్ లకు డిఐజి అమ్మిరెడ్డి చేతుల మీదుగా అవార్డులు బుధవారం పంపిణీ చేశారు. పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెలచివరి క్రైం రివ్యూ మీటింగ్‌లో వీటిని అందజేశారు.